RNI No - APTEL/2022/81596

జనోదయ

కరీంనగర్ శుక్రవారం 222.05.2026 సంపుటి : 03 సంచిక : 163 పేజీలు : 08 వెల : రూ.5

Karimnagar Thursday 22.05.2026 Volume: 03 Issue 163 Pages 08 Cost 5/

తెలుగు దినపత్రిక

దేశంలో మండుతున్న ఎండలు..

పిడుగురాళ్లలో 48.1 డిగ్రీల ఉష్ణోగ్రత

నిప్పుల కుంపటి

దేశవ్యాప్తంగా ఎండలు మండుతున్నాయి. మధ్యాహ్నం వేళ జనం ఇళ్ల నుంచి కాలు బయటపెట్టాలంటేనే భయంతో వణికిపోతున్నారు. దాదాపు దేశమంతటా 43 డిగ్రీలకు పైనే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇక ఏపీలోని పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో అయితే రికార్డు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అక్కడ బుధవారం 47.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవగా.. గురువారం అది మరింత పెరిగి 48.1 డిగ్రీలకు చేరింది. ఏపీలో ఇదే అత్యధిక ఉష్ణోగ్రత కావడం గమనార్హం.ఇక ఆ రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ భానుడు భగభగమంటున్నాడు. బాపట్ల జిల్లా వేటపాలెం, కృష్ణా జిల్లా నందివాడలో 47.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎన్టీఆర్ జిల్లా టి గుడిపాడు, ప్రకాశం జిల్లా అద్దంకిలో 47.4 డిగ్రీలు, ఏలూరు జిల్లా అల్లిపల్లిలో 47.3 డిగ్రీలు, నెల్లూరు జిల్లా కావలిలో 46.4 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా గురువారం నాడు 18 జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో 45 డిగ్రీలకు పైగా, 20 జిల్లాల్లోని సుమారు 200 మండలాల్లో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు తెలిపారు.ఈ నేపథ్యంలో ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ప్రజలకు కీలక సూచనలు చేసింది. వచ్చే సోమవారం వరకు రాష్ట్రంలో ఎండల తీవ్రత ఇదే విధంగా కొనసాగే అవకాశం ఉందని తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించింది.

కేటీఆర్ అసలు మనిషేనా?

రాష్ట్రంలో వరి కొనుగోలు ఇంకో 20 శాతమే ఉందని, దానిని కూడా సేకరిస్తామని సీఎం రేవంత్ చెప్పారు. తమ ప్రభుత్వం ఇప్పుడు కొనుగోలు చేసిన స్థాయిలో గడిచిన పదేళ్లలో ఎప్పుడూ బీఆర్ఎస్ ధాన్యం కొనుగోలు చేయలేదని తప్పుబట్టారు. "ధాన్యం కొనుగోలు పూర్తయ్యాక 72 గంటల్లోనే నిధులు రైతులకు అందిస్తున్నాం. బీఆర్ఎస్ హయాంలో 6-7 నెలలు పట్టేది. ధాన్యం లోడ్‌తో వెళ్లిన లారీల నుంచి దిగుమతి కాకుండా బీఆర్ఎస్ అనుకూల మిల్లర్లు వ్యవహరిస్తున్నారు. బీఆర్ఎస్ నేతలు వెళ్లి ధాన్యాన్ని దించనీయడం లేదు. బీఆర్ఎస్ ఆర్గనైజ్డ్ క్రైమ్ చేస్తోంది"

కేటీఆర్‌ది ముమ్మాటికీ శాడిజమే

బాలికను అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేస్తారా!?

బండి సంజయ్‌కు, కేటీఆర్‌కు మధ్యన ఏదో పంచాయితీ ఉన్నట్లుంది

కేటీఆర్ జడ్జిగా.. ప్రవీణ్‌కుమార్ దర్యాప్తు అధికారిగా శిక్షలు కూడా వేసేశారు

బీఆర్ఎస్‌ది ఆర్గనైజ్డ్ క్రైం: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపాటు

హైదరాబాద్, మే 21 : "కేటీఆర్ అసలు మనిషేనా!? రాజకీయాన్ని, సమస్యను వేరుగా చూడాలి. రాజకీయంగా నాతో కొట్లాడాలి. కానీ, మైనర్ బాలికను అడ్డుపెట్టుకుని రాజకీయం చేయడమేంటి!? బాలికను అడ్డం పెట్టుకుని ఏదో చేయాలనే శాడిజం ఏంటి!? ఇది ముమ్మాటికీ శాడిజమే" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మనిషికి ఉండాల్సిన కనీస విలువలు గానీ, మానవత్వం గానీ బీఆర్ఎస్‌కు, ఆ పార్టీ నాయకులకు లేవని, వాళ్లు అసలు మనుషులుగా కూడా వ్యవహరించడం లేదని మండిపడ్డారు. వరి వేస్తే ఉరి అని చెప్పినవాళ్లు ఇప్పుడు సిగ్గు లేకుండా రైతుల కల్లాల దగ్గరకు వెళ్తున్నారని, పైగా మరణించిన రైతు దగ్గర నవ్వుకుంటూ సెల్ఫీలు తీసుకుంటున్నారని మండిపడ్డారు. వాళ్ల దగ్గర దొంగ సొమ్ము చాలా ఉందని, రైతు కుటుంబానికి ఎంతో కొంత సాయం చేయవచ్చని, అయినా చేయడం లేదని తప్పుబట్టారు. సాయం చేయకపోగా ఈ శవ రాజకీయాలు ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి వివేక్‌తో కలిసి గురువారం సచివాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా.. ఇటీవల రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారిన మైనర్ బాలిక పోక్సో కేసు విషయం గురించి సీఎం రేవంత్‌ను విలేకరులు అడగ్గా.. దానిపై ఆయన స్పందించారు. "మైనర్ బాలిక వ్యవహారంలో ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారు. ఇది చాలా సున్నితమైన అంశం. దానిని కూడా రాజకీయం చేస్తున్నారు. బండి సంజయ్‌కు, కేటీఆర్‌కు మధ్యన ఏదో పంచాయితీ ఉన్నట్టుంది. దానిని పిల్లల మీద పెట్టి కేటీఆర్ రాజకీయం చేస్తున్నారు. ఇది ఎంతవరకు సమంజసమో వారే ఆలోచించుకోవాలి" అని వ్యాఖ్యానించారు. బండి భగీరథ్‌ను అరెస్టు చేశామని పోలీసులు చెప్పారని, తాను దానినే నమ్ముతున్నానని తెలిపారు. పోలీసులను ఇంటికి పిలిచి అప్పగిస్తే దాన్ని సరెండర్ అంటారని, అప్పా జంక్షన్ దగ్గర నాకాబందీ నిర్వహిస్తున్న సమయంలో భగీరథ్‌ను అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తనకు చెప్పారని తెలిపారు. అరెస్టు చేశామని పోలీసులు చెబుతుంటే, సరెండర్ చేశామని సంజయ్ అంటున్నారని, అప్పా జంక్షన్ ఎవరి ఇల్లు అని ప్రశ్నించారు. భగీరథ్‌పై పోక్సో కేసు విషయంలో ప్రభుత్వం చట్టపరంగా చర్యలు తీసుకుందని, కానీ, కేటీఆర్ జడ్జిగా, ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ దర్యాప్తు అధికారిగా (ఐ.వో)గా వ్యవహరించి వాళ్లే శిక్షలు కూడా వేశారని తప్పుబట్టారు.

చెన్నై ఖేల్ ఖతం

89 రన్స్ తేడాతో టైటాన్స్ చేతిలో చిత్తు

6లో..

ఐదుసార్లు చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ కథ ముగిసింది. గుజరాత్ టైటాన్స్ కొట్టిన ఆఖరి పంచ్‌కు 19వ సీజన్‌లో లీగ్ దశలోనే ఇంటిదారి పట్టింది. బ్యాటింగ్, బౌలింగ్‌లో తేలిపోయిన ఆ జట్టు గురువారం జరిగిన తమ ఆఖరి మ్యాచ్‌లో 89 పరుగుల తేడాతో టైటాన్స్ చేతిలో చిత్తయింది.

వైభవంగా ప్రారంభమైన సరస్వతి అంత్య పుష్కరాలు

పన్నెండు రోజుల పాటు కొనసాగే సరస్వతి అంత్య పుష్కరాలు గురువారం నాడు కాళేశ్వరం పుష్కరఘాట్‌లో వేద మంత్రోచ్ఛారణల మధ్య ఘనంగా ప్రారంభమయ్యాయి. కంచికామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి ఉదయం 5.43 గంటల పవిత్ర ముహూర్తంలో తొలిస్నానం ఆచరించి పుష్కరాలను లాంఛనంగా ప్రారంభించారు. ఐటి, పరిశ్రమలు శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దంపతులు, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ధార్మిక సలహాదారు శ్రీ గోవింద హరి తదితరులు పుష్కర ఉత్సవాల ప్రారంభ కార్యక్రమంలో పుణ్యస్నానమాచరించారు.భూపాలపల్లి శాసనసభ్యుడు గండ్ర సత్యనారాయణ రావు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి లు కూడా పుష్కరస్నానం ~~ఆచరించి వేద పండితులు~~ ఆశీర్వాదాలు స్వీకరించారు.

2లో..

బొద్దింకల పార్టీ విప్లవం

బూజుపట్టిన రాజకీయంపై డిజిటల్ ఉద్యమం

ఇన్‌స్టాగ్రామ్‌లో సరికొత్త రికార్డు..

కాంగ్రెస్, బీజేపీలను దాటేసిన 'కాక్రోచ్ జనతా పార్టీ'

ఢిల్లీ : భారతదేశ సోషల్ మీడియా చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ఒక వినూత్న డిజిటల్ విప్లవం నడుస్తోంది. కేవలం ఒక కామెంట్ వలన ప్రారంభమైన కాక్రోచ్ జనతా పార్టీ అనే రాజకీయ ఉద్యమం, కేవలం నాలుగైదు రోజుల్లోనే కాంగ్రెస్, బీజేపీ వంటి దేశంలోని అతిపెద్ద అధికారిక రాజకీయ పార్టీల ఇన్‌స్టాగ్రామ్ ఫాలోవర్ల సంఖ్యను దాటేసి సరికొత్త రికార్డు సృష్టించింది. ప్రస్తుతం ఇన్‌స్టాగ్రామ్‌లో బీజేపీకి సుమారు 8.7 మిలియన్ల ఫాలోవర్లు ఉండగా, కాంగ్రెస్‌కి 13.2 మిలియన్ ఫాలోవర్లు ఉన్నారు. అయితే ఈ రెండింటిని దాటేసి 13.6 మిలియన్ ఫాలోవర్లతో దూసుకుపోతోంది ఈ కాక్రోచ్ జనతా పార్టీ. ఇటీవల ఒక కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ మాట్లాడుతూ, ఉద్యోగాలు లేక సమాజంలో సరైన స్థానం దొరకని కొందరు యువకులు సోమరిపోతులుగా, బొద్దింకలుగా, సమాజ పరాన్నజీవులుగా మారిపోతున్నారని, వారంతా జర్నలిస్టులు, ఆర్‌టీఐ కార్యకర్తలు, సోషల్ మీడియా ముసుగులో వ్యవస్థలపై దాడులు చేస్తున్నారంటూ కామెంట్లు చేశాడు. అయితే దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, అవినీతీ, రూపాయి పతనం, ఇంధన ధరలు, పేపర్ లీకేజీల సమస్యలతో ఇప్పటికే తీవ్ర అసంతృప్తితో ఉన్న యువతకు ఈ వ్యాఖ్యలు తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించాయి. ఇక వ్యవస్థ తమను బొద్దింకలుగా చూస్తే, ఆ బొద్దింకలన్నీ ఏకమైతే ఎలా ఉంటుందో చూపిస్తామంటూ అభిజీత్ దిప్కే అనే వ్యక్తి ఈ 'కాక్‌రోచ్ జనతా పార్టీ'ని స్థాపించాడు. దీంతో ఈ పార్టీని స్థాపించి సోషల్ మీడియాలో జాయిన్ అయితే కొద్ది గంటల్లోనే ఈ పార్టీకి విపరీతమైన మద్దతు లభించింది. ప్రస్తుతం ఇన్‌స్టాగ్రామ్ తో పాటు, ఎక్స్, ఫేస్ బుక్ తదితర సోషల్ మీడియాలలో ఈ పార్టీకి దూసుకు పోతోంది. మరోవైపు ఇది కేవలం ఫన్ కోసం పెట్టిన పార్టీలా కనిపిస్తున్నా, దేశంలోని నిరు ద్యోగం, నీట్ పేపర్ లీకేజీలు, పరీక్షల కుంభకోణాలపై యువత నిరస నను తెలియజేయడానికి 5 ముఖ్యమైన డిమాండ్లను తెరపైకి తెచ్చింది. జడ్జీలకు పదవీ విరమణ తర్వాత ఎలాంటి రాజకీయ ప్రయోజనాలు కల్పించకూడదని, పార్టీలు మారే ప్రజాప్రతినిధులపై సుదీర్ఘ కాలం పాటు ఎన్నికల నిషేధం విధించాలని, తాము కూడా ఆర్‌టీఐ పరిధిలోకి వస్తామని, పార్లమెంట్‌లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిం చడంతో పాటు తప్పుడు వార్తలు ప్రచారం చేసే మీడియా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తోంది.

వైభవంగా ప్రారంభమైన సరస్వతి అంత్య పుష్కరాలు

జనోదయ : హైదరాబాద్

పన్నెండు రోజుల పాటు కొనసాగే సరస్వతి అంత్య పుష్కరాలు గురువారం నాడు కాళేశ్వరం పుష్కరఘాట్‌లో వేద మంత్రోచ్ఛారణల మధ్య ఘనంగా ప్రారంభమయ్యాయి. కంచికామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి ఉదయం 5.43 గంటల పవిత్ర ముహూర్తంలో తొలిస్నానం ఆచరించి పుష్కరాలను లాంఛనంగా ప్రారంభించారు. ఐటి, పరిశ్రమలు శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దంపతులు, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ధార్మిక సలహాదారు శ్రీ గోవింద హరి తదితరులు పుష్కర ఉత్సవాల ప్రారంభ కార్యక్రమంలో పుణ్యస్నానమాచరించారు. భూపాలపల్లి శాసనసభ్యుడు గండ్ర సత్యనారాయణ రావు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిలు కూడా పుష్కరస్నానం ఆచరించి వేద పండితులు ఆశీర్వాదాలు స్వీకరించారు. పుష్కరాల సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చి పవిత్ర స్నానాలు ఆచరిస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేపట్టింది. భద్రత, పారిశుధ్యం, తాగునీరు, వైద్య సేవలు, ప్రత్యేక అంబులెన్సులు, రవాణా సదుపాయాల వంటి అన్ని ఏర్పాటు చేశారు. ఈ పుణ్యకాలంలో భక్తులు సౌకర్యవంతంగా, సురక్షితంగా పుష్కర స్నానాలు నిర్వహించుకునేలా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. పుష్కరాల సందర్భంగా పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కాళేశ్వరం ముక్తేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించే భక్తుల కోసం ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. పలు ధార్మిక సంఘాలు ఉచిత అన్నప్రసాద వితరణ చేస్తున్నాయి, కాళేశ్వరంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేసి ఎండ తీవ్రతనుంచి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తున్నారు.

ఆలయ విశిష్టతలు:

భారతదేశంలో ఎక్కడా లేనివిధంగా ఒకే పానవట్టంపై యముడు (కాళేశ్వరుడు) శివుడు (ముక్తేశ్వరుడు) కొలువై ఉండడం ఈ ఆలయ ప్రత్యేకత. ఇక్కడ కాళేశ్వరునికి పూజలు చేసిన తర్వాతే ముక్తేశ్వరునికి పూజలు చేయడం ఆనవాయితీ. ముక్తేశ్వర లింగం పైభాగంలో రెండు చిన్న రంధ్రాలు ఉంటాయి. ఎంత నీటితో అభిషేకం చేసినా ఆ నీరు అందులోనే ఇంకిపోవడం ఒక అద్భుతం.

భక్తులు తమ పాపాలు తొలగిపోవడానికి, మృత్యు భయం తొలగిపోవడానికి ఆలయంలోని 'యమ కోణం' (ఒక చిన్న సందు) గుండా వెళ్లడం ఒక ముఖ్యమైన ఆచారం.

ఘనంగా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి

జనోదయ : గోదావరిఖని

రామగుండం అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్న ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు, నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొంతల రాజేష్ ఆధ్వర్యంలో గురువారం జీఎం కాలనీ మూలమలుపు వద్దనున్న రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ గారి వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నగర మేయర్ మహంకాళి స్వామి రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ బీసీ విభాగం కార్పొరేషన్ అధ్యక్షులు, కార్పొరేటర్ గట్ల రమేష్ మరియు మేయర్ మహంకాళి స్వామి రాజీవ్ గాంధీ దేశానికి అందించిన సేవలను, సాంకేతిక విప్లవానికి ఆయన వేసిన బాటను స్మరించుకున్నారు. దేశ యువతకు కొత్త దిశానిర్దేశం చేసిన దూరదృష్టి నాయకుడిగా రాజీవ్ గాంధీ గారిని కొనియాడుతూ, భారతదేశాన్ని ఆధునిక సాంకేతిక యుగంలోకి తీసుకెళ్లిన మహానేతగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కాల్వ లింగస్వామి, డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య,కార్పొ

రేటర్లు ధూళికట్ట సతీష్, మాటూరి సత్య ప్రసాద్, నాయకులు గడ్డం శ్రీనివాస్,గంగ శ్రీనివాస్, బెంద్రం రాజిరెడ్డి, కల్వల రంజిత్, ఈదునూరి హరిప్రసాద్, ఓదెలు యాదవ్, బాలరాజ్ కుమార్, అనుమ సత్యనారాయణ, కనుకుంట్ల అశోక్, శరత్ లతో పాటు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని రాజీవ్ గాంధీ గారికి ఘన నివాళులు అర్పించారు.

రాజీవ్ గాంధీ సేవలు దేశ చరిత్రలో చిరస్మరణీయం

రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలలోఎంపీ డాక్టర్ కడియం కావ్య

జనోదయ : వరంగల్

భారతరత్న, దివంగత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎంజీఎం సర్కిల్‌లో రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. గీసుగొండ మండలంలోని కోనాయిమాకుల వద్ద రాజీవ్ గాంధీ గారి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. గీసుగొండ మండలం, కె.యం.టి.పీ రెసిడెన్షియల్ లేఅవుట్ గ్రామంలో 58 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న పార్క్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, దొంతి మాధవ రెడ్డి, డీసీసీ వరంగల్, హనుమకొండల అధ్యక్షులు అయూబ్, ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ..భారతదేశాన్ని ఆధునిక దిశగా తీసుకెళ్లిన దూరదృష్టి గల నాయకుడు రాజీవ్ గాంధీ అని అన్నారు. దేశంలో సమాచార సాంకేతిక రంగం,

టెలికాం విప్లవానికి ఆయన బలమైన పునాది వేశారని పేర్కొన్నారు. యువతకు రాజకీయాల్లో ప్రాధాన్యత కల్పించిన నాయకుడిగా రాజీవ్ గాంధీ చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం, మహిళా సాధికారత కోసం రాజీవ్ గాంధీ చేసిన కృషి దేశ చరిత్రలో చిరస్మరణీయమని అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తోందని తెలిపారు. దేశ ఐక్యత, లౌకికవాద పరిరక్షణ కోసం రాజీవ్ గాంధీ చేసిన సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. యువత రాజీవ్ గాంధీ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధికి కృషి చేయాలని ఎలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై వాహనాలను పార్కింగ్ చేస్తే కఠిన చర్యలు

వరంగల్ సిపి సన్ ప్రీత్ సింగ్ వాహన పార్కింగ్ స్థలాలను పరిశీలన

జనోదయ : వరంగల్ క్రైమ్

రోడ్లపై ట్రాఫిక్ కు అంతరాయం కలిగిస్తూ వాహనాలను పార్కింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ హెచ్చరించారు. ట్రై సిటి పరిధిలో ట్రాఫిక్ సమస్యలను అధిగమించడం హనుమకొండ, వరంగల్ ప్రాంతాల్లో ప్రధాన రోడ్డు మార్గంలో వాహన పార్కింగ్ కోసం అవసరమైన స్థలాలను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్‌సింగ్ గురువారం సంబంధిత అధికారులతో కల్సి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. గురువారం ట్రాఫిక్ అధికారులతో కలసి హనుమకొండలోని అశోక జంక్షన్, హన్మకొండ చౌరస్తా, ఏనుగుల గడ్డతో పాటు వరంగల్ నగరంలో పోచమ్మ మైదాన్, హెడ్ పోస్టాఫీస్ ప్రాంతాలను సందర్శించి ఈ ప్రాంతాల్లో వాహన పార్కింగ్ ఎర్పాటుకు అవసరమైన స్థల విస్తీర్ణం, సాధ్యాసాధ్యాలపై వరంగల్ పోలీస్ కమిషనర్ అధికారులతో క్షేత్ర స్థాయిలో చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. ప్రధానంగా ట్రై సిటి ట్రాఫిక్ సమస్య అధిగమించేందుకు వ్యాపార సముదాయాలు, షాపింగ్ మాల్స్ ముందు వాహనాలను పార్కింగ్ చేయకుండా భవన సెల్లార్లలో వాహనాలను పార్కింగ్ చేసే విధంగా సంబంధిత వ్యాపారస్తులను ట్రాఫిక్ అధికారులు ఆ, తద్వారా కొద్ది వరకు పార్కింగ్ సమస్యను అధిగమించగలమని పోలీస్ కమిషనర్ పెర్కొన్నారు. ఈ పరిశీలనలో సిపి వెంట సెంట్రల్ జోన్ డిసిపి దార కవిత, ట్రైనీ ఐపిఎస్ మనీషా నేహ్రా, ట్రాఫిక్ అడిషినల్ డిసిపి ప్రభాకర్ రావు, ట్రాఫిక్ ఎసిపి సత్యనారయణ, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్లు వెంకన్న, సుజాత, హన్మకొండ, మట్టెవాడ ఇన్స్సెక్టర్లు శివకుమార్, కరుణాకర్‌తో పాటు ట్రాఫిక్ ఎస్.ఐలు, మున్సిపల్ కార్పోరేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు పునరంకితం కావాలి

ఎంజిఎం సెంటర్‌లో రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించిన సోషల్ మీడియా మాజీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ అడుప మహేష్

జనోదయ : వరంగల్ ప్రతినిధి

భారతదేశ సాంకేతిక విప్లవ పితామహుడు, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని ఎంజిఎం సెంటర్ చౌరస్తా వద్ద ఆయన విగ్రహానికి సోషల్ మీడియా మాజీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ అడుప మహేష్ గురువారం పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా అడుప మహేష్ మాట్లాడుతూ.. భారతదేశాన్ని 21వ శతాబ్దపు ఆధునిక దేశంగా తీర్చిదిద్దేందుకు రాజీవ్ గాంధీ ఎనలేని కృషి చేశారని కొనియాడారు. నేడు దేశం ఐటీ, టెలికాం రంగాల్లో సాధించిన ప్రగతికి ఆయన వేసిన పునాదులే కారణమని గుర్తుచేశారు. దేశంలో 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించి యువతకు రాజకీయాల్లో పెద్దపీట వేసిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కుతుందన్నారు. దేశ ఐక్యత, సమగ్రత కోసం ప్రాణాలనే త్యాగం చేసిన అమరజీవి రాజీవ్ గాంధీ ఆశయ సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు దస్రు నాయక్, వడ్లకొండ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అంకిత్ కోరిక మేరకు అన్నదానం 'ఆశీర్వదించిన స్థానికులు'

అమెరికాలో ఉన్నత విద్య అభ్యసిస్తున్న పోతు అంకిత్ జన్మదినం

జనోదయ : వరంగల్ ప్రతినిధి

ప్రముఖ వ్యాపారవేత్త పోతు చంద్రశేఖర్, లావణ్య దంపతుల ఏకైక కుమారుడు పోతు అంకిత్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఉన్నత విద్యాభ్యాసం కోసం అమెరికాలో ఉన్న అంకిత్ కోరిక మేరకు పేద ప్రజలకు, విద్యార్థులకు అన్నదానం, వస్త్రదానం కార్యక్రమాలు నిర్వహించారు. అన్నదానం, వస్త్రదానం చేయడంతో స్థానిక ప్రజలు అంకిత్‌ను మనసారా ఆశీర్వదించారు. ప్రస్తుతం అంకిత్ ఇక్కడ లేకున్నా తల్లిదండ్రుల కృషితో జరిగిన ఈ సేవా కార్యక్రమాలపై స్థానికులు అభినందించారు.

రామగుండంలో సహజ వనరుల దోపిడీ

- కోర్టు స్టే ఉన్నప్పటికీ అధికార గర్వంతో అక్రమ పనులు
- రచ్చ గుట్ట మట్టిని అక్రమంగా తరలిస్తున్న వైనం
- బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి ఆరోపణ

జనోదయ : అంతర్గాం : అంతర్గాం మండలం పెద్దంపేట గ్రామ శివారులో ఉన్న రచ్చ గుట్ట నుండి మట్టిని అక్రమంగా తరలిస్తు న్నారని, దీనికి రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ బాధ్యత వహించాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి ఆయన గురువారం మట్టి తవ్వకాలు జరుగుతున్న రచ్చ గుట్ట పరిసరాలను పరిశీలించారు. ఈ గుట్టపై ఎలాంటి తవ్వకాలు జరపవద్దని కోర్టు స్టే ఉన్నప్పటికీ ప్రభుత్వ అండదండలతో ఎమ్మెల్యే ఇష్టారాజ్యంగా అనుమతులు ఇస్తున్నాడని విమర్శించారు. గతంలో లింగాపూర్ సమీపంలో ఉన్న గుట్టను సైతం మట్టిని అక్రమంగా తరలించారని గుర్తు చేశారు. ప్రస్తుతం మట్టి తవ్వకాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లారీల ద్వారా అక్రమంగా తరలిస్తూ రోడ్డు విస్తరణ పనులకు వినియోగిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే 20 కోట్ల విలువ చేసే మట్టిని దౌర్జన్యంగా తరలించారని అన్నారు. ఈ విషయంలో కనీసం మైనింగ్ అధికారులు, గ్రామ పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సహజ వనరులు దోచుకోవడం వల్ల భవిష్యత్తులో పర్యావరణానికి పెను ముప్పు తయారవుతుందని అన్నారు. గ్రామ అభివృద్ధికి, ప్రజలకు మౌలిక సదుపాయాలు అందించాల్సిన ప్రజాప్రతినిధులు అక్రమంగా సహజ వనరులను దోచుకోవడం సరైన విధానం కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని... లేదంటే లీగల్‌గా కోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు. అధికారం అడ్డం పెట్టుకొని అక్రమాలు పాల్పడితే ఊరుకునేది లేదని, భవిష్యత్తులో ప్రజలే గుణపాఠం చెప్తారని అన్నారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రానున్నది కేసీఆర్ ప్రభుత్వమేనని, ప్రజలు, రైతులు అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా ఉంటారని పేర్కొన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ గ్రామ సర్పంచ్ ఆముల పెద్ద శ్రీనివాస్, ఉప సర్పంచ్ కరివేద స్రవంతి- శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కొలిపాక శరణ్య- మధుకర్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు పుట్ట శ్రీనివాస్ యాదవ్, గౌడ సంఘం మాజీ అధ్యక్షుడు మెరుగు రమేష్ గౌడ్, బండి మహేష్ గౌడ్, కోల మధుకర్ పటేల్, గోలి ప్రకాష్, గుడి రమేష్ రెడ్డి, తరుణ్, జాహెద్ పాషా, అల్లి గణేష్, కడర్ల శ్రీధర్ తదితరులు ఉన్నారు.

ఈఏపీసెట్-2026 టాపర్ విద్యార్థిని రుషికి ఘన సన్మానం

ప్రతిభకు పట్టుదలే అసలైన బలం : ఎంపీ ఈటల రాజేందర్

జనోదయ : మే 21, గ్రేటర్ హైదరాబాద్

ఈఏపీసెట్-2026 ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రంలోనే తొలి స్థానం సాధించిన చిలుకానగర్ డివిజన్‌కు చెందిన విద్యార్థిని ఎం. రుషిని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ ఘనంగా సన్మానించారు. చిలుకానగర్ డివిజన్ నాయకుడు తెలంగాణ సంపత్‌తో కలిసి విద్యార్థినిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ ప్రతిభకు స్థాయి, అంతస్తు, హోదా వంటి అంశాలు ముఖ్యం కాదని, సాధించాలనే తపన, ఆకాంక్ష, పట్టుదల ఉంటే ఎంతటి విజయాన్నైనా అందుకోవచ్చని అన్నారు. రాష్ట్రంలో మొదటి స్థానం సాధించిన విద్యార్థిని రుషి నేటి యువతకు, ముఖ్యంగా విద్యార్థులకు ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రంలోని విద్యార్థులు రుషిని స్ఫూర్తిగా తీసుకుని విద్యాభ్యాసంలో మరింత కృషి చేసి తమ జీవితాలకు బంగారు బాట వేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ ఈ కార్యక్రమంలో చిలుకానగర్ డివిజన్ నాయకులు సంపత్ పాల్గొన్నారు.

ఎబోలా ఎఫెక్ట్.. భారత్-ఆఫ్రికా శిఖరాగ్ర సదస్సు వాయిదా

ఆఫ్రికా ఖండంలోని పలు దేశాల్లో ఎబోలా వైరస్ కలకలం రేపుతుండటంతో ఢిల్లీలో జరగాల్సిన నాలుగో 'భారత్-ఆఫ్రికా ఫోరమ్ సమ్మిట్' వాయిదా పడింది. మే 28 నుంచి 31 వరకు జరగాల్సిన ఈ సదస్సును ప్రస్తుత ప్రజారోగ్య పరిస్థితుల దృష్ట్యా వాయిదా వేస్తున్నట్లు కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ గురువారం ప్రకటించింది. డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో , ఉగాండా దేశాల్లో ఎబోలా వ్యాప్తి తీవ్రంగా ఉండటంతో 'ప్రపంచ ఆరోగ్య సంస్థ ' ఇటీవల అంతర్జాతీయ హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సదస్సును వాయిదా వేయడానికి ముందు భారత ప్రభుత్వం, ఆఫ్రికన్ యూనియన్ ఛైర్‌పర్సన్, ఆఫ్రికన్ యూనియన్ కమిషన్ మధ్య సుదీర్ఘ చర్చలు జరిగాయి. ఆఫ్రికా దేశాల ప్రతినిధులు, కీలక నేతలు అందరూ పూర్తి స్థాయిలో హాజరయ్యేలా చూడటంతో పాటు, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని సదస్సును మరో తేదీకి మార్చడమే మంచిదని ఇరుపక్షాలు నిర్ణయించాయి. ఆఫ్రికాలో ఎబోలాను అదుపు చేయడానికి 'ఆఫ్రికా సీడీసీ' తీసుకుంటున్న చర్యలకు భారత్ తన పూర్తి సంఘీభావాన్ని, మద్దతును ప్రకటించింది.

గుజరాత్‌లో జరిగే 'ప్రేరణ' కార్యక్రమానికి

బూరుగుపల్లి విద్యార్థిని ఎంపిక

జనోదయ : గంగాధర మే 21:

గంగాధర మండలంలోని బూరుగుపల్లి గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బూరుగుపల్లి విద్యార్థిని దూలం వెన్నెల (9వ తరగతి) గుజరాత్ రాష్ట్రంలోని వడోదరలో నిర్వహించే ప్రేరణకు ఎంపికైంది. ఈ ప్రయోగాత్మక అభ్యసన కార్యక్రమం జూలై 19 నుండి 26 వరకు జరుగనుంది. ఈ శిక్షణ కార్యక్రమంలో విద్యార్థులకు ఆర్ట్, డ్రాయింగ్, కల్చరల్ ఆక్టివిటీస్, సైన్స్‌కు సంబంధించిన పలు అంశాలపై ప్రత్యేక శిక్షణ అందించనున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుండి కేవలం ఇద్దరు విద్యార్థులు మాత్రమే ఈ కార్యక్రమానికి ఎంపిక కాగా, అందులో బూరుగుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఒకరు కావడం గర్వకారణమని ప్రధానోపాధ్యాయులు డాక్టర్ ఎలిగేటి మల్లికార్జున్ తెలిపారు. శిక్షణకు సంబంధించిన మొత్తం ఖర్చుతో పాటు రానుపోను ప్రయాణ చార్జీలను కూడా కేంద్ర ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రేరణ కార్యక్రమానికి ఎంపికైన విద్యార్థిని దూలం వెన్నెలను గ్రామ సర్పంచ్ దూలం కళ్యాణ్, ఉపసర్పంచ్ తిరుపతి, గ్రామస్తులు, ఉపాధ్యాయులు నగేష్, విజయకుమార్, లక్ష్మిరాజాం, జగదీశ్వర్ రెడ్డి, భూమయ్య, మంజుల, రాయమల్లయ్య, ప్రవీణలత, రాజబాబు, మల్లేశం, సత్యనారాయణ, శ్రీధర్, లత, రజిత, కస్తూరి మాధవి అభినందించారు.

జర్నలిస్ట్ సంక్షేమ సంఘం
Red 914/2015
జర్నలిస్ట్ సంక్షేమమే పరమావధిగా
జర్నలిస్ట్ హక్కుల కోసం....
వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...
సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం॥ 9618616110

మ్యూల్ అకౌంట్ సరఫరాదారుడిని అరెస్ట్ చేసిన సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు

సోషల్ మీడియా ద్వారా బ్యాంక్ ఖాతాలు సేకరించి సైబర్ మోసాలకు వినియోగం

జనోదయ : శేరిలింగంపల్లి

సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు, ఎస్‌వోటీ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో సైబర్ మోసాలకు మ్యూల్ బ్యాంక్ అకౌంట్లు సరఫరా చేస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు. ట్రేడింగ్ ఫ్రాడ్, డిజిటల్ అరెస్ట్, ఆన్‌లైన్ గేమింగ్, పార్ట్‌టైం జాబ్ మోసాలు తదితర సైబర్ నేరాలకు ఈ ఖాతాలను వినియోగించినట్లు పోలీసులు వెల్లడించారు. అరెస్టు అయిన నిందితుడు దిలీప్ సింగ్ (27), జీడిమెట్ల అపూర్వ కాలనీలో నివాసం ఉంటూ డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఇన్‌స్టాగ్రామ్ ప్రకటనల ద్వారా "జోర్డాన్", "పింటూ భయ్యా" అనే వ్యక్తులతో పరిచయం ఏర్పడి, బ్యాంక్ ఖాతాలు సమకూర్చితే భారీ కమిషన్ ఇస్తామని చెప్పడంతో ఈ వ్యవహారంలో చేరినట్లు విచారణలో వెల్లడైంది. నిందితుడు తనతో పాటు ఇతరుల బ్యాంక్ ఖాతాలు, ఏటీఎం కార్డులు, పాస్‌బుక్స్, చెక్ బుక్స్, సిమ్ కార్డులు సేకరించి సైబర్ మోసగాళ్లకు అందజేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి రూ.1.02 లక్షల నగదు, మూడు మొబైల్ ఫోన్లు, 12 డెబిట్ కార్డులు,

చెక్‌బుక్స్, పాస్‌బుక్స్ స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో కొంతమంది బ్యాంకు ఉద్యోగుల పాత్ర కూడా ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, పూర్తి స్థాయిలో దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. సులభంగా డబ్బు వస్తుందని చెప్పి బ్యాంక్ ఖాతాలు అద్దెకు ఇవ్వొద్దని, ఏటీఎం కార్డులు, ఓటీపీలు, బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని పోలీసులు హెచ్చరించారు. సోషల్ మీడియాలో వచ్చే ఈజీ మనీ ఆఫర్ల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సస్పీసియస్ లావాదేవీలు గమనించిన వెంటనే పోలీసులకు లేదా నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు.

ఏనుమాములలో బీఆర్ఎస్ బూత్ కమిటీల నియామకం

సౌరం కళ్యాణ్ ఆధ్వర్యంలో 115, 116 బూత్ కమిటీల ఏర్పాటు నలుగురు కన్వీనర్లు

జనోదయ : వరంగల్ ప్రతినిధి

14వ డివిజన్ ఏనుమాముల గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ 115, 116 బూత్ కమిటీలను సౌరం కళ్యాణ్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేశారు. పార్టీలో యాక్టివ్‌గా ఉన్న సౌరం అజయ్, మహంకాళి సునీల్, సౌరం ఆంధ్రయ్య, పెంటోజు వీరచారిలను బూత్ కన్వీనర్లుగా నియమించారు. బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త సభ్యత్వ నమోదులో భాగస్వాములు కావాలని ఇంచార్జిలు కేతిరి రాజశేఖర్, పత్రి సుభాస్ ముడుసు నరసింహ, నాగనబోయిన మాధవి, పత్రి రాజపోషాలు, పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు రాజమౌళి, సుధాకర్, ఏలీయా, ప్రభుదాస్, వినయ్, కుమార స్వామి, రాజు, లక్ష్మీ, మరియా, అశోక్, మహేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి

ఎంజీఎం జంక్షన్‌లో కాంగ్రెస్ నేతల నివాళి కొండా దంపతుల ఆదేశాల మేరకు కార్యక్రమం కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు గోపాల నవీన్ రాజ్

జనోదయ : వరంగల్ ప్రతినిధి

మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి సందర్భంగా కొండా దంపతుల ఆదేశం మేరకు వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని ఎంజీఎం జంక్షన్‌లో గురువారం కాంగ్రెస్ నేతలు నివాళులర్పించారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్ రాజ్ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా నవీన్ రాజ్ మాట్లాడుతూ.. భారతదేశం కోసం ప్రాణ త్యాగం చేసిన గొప్ప మహనీయుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించిన గొప్ప నాయకుడని నేరుగా గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి నిధులు పంపిన మేధావి అని తెలిపారు. రాజీవ్ గాంధీ ఆశయాలను కాంగ్రెస్ నాయకులు,

కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పుల్ల పద్మావతి, టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్, కొత్తపెల్లి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు కత్తెరశాల వేణుగోపాల్, జారతి రమేష్, సోమిశెట్టి ప్రవీణ్ కుమార్, బైరబోయిన దామోదర్ యాదవ్, నేతలు మబ్బు ప్రవీణ్, సయ్యద్ వసీం, ఈనాయత్ అక్తర్, భాషపాక సదానందం, కావేటి కవిత, సందేల లాజర్, క్యాతం రవీందర్ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మహా న్యూస్ ఛానల్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ ఫిర్యాదు

సీపీని కలిసిన స్వేరోస్, బీఆర్ఎస్ నేతలు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై అసత్య ప్రచారమని ఆరోపణ ఎండీ వంశీ కృష్ణపై చర్యలకు డిమాండ్

జనోదయ : వరంగల్ ప్రతినిధి

డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై అసత్య ఆరోపణలు చేస్తూ.. ప్రసారాలు చేస్తోందంటూ మహా న్యూస్ ఛానల్‌పై స్వేరోస్, బీఆర్ఎస్ నాయకులు గురువారం వరంగల్ సీపీకి ఫిర్యాదు చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని కోరారు. గత మూడు రోజులుగా మహా న్యూస్ ఛానల్‌లో "డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కొడుకులు మంచి వాళ్లా, చెడ్డ వాళ్లా" అనే విధంగా స్క్రోలింగ్స్, ప్రసారాలు చే

స్తూ.. అసాంఘిక శక్తులను రెచ్చగొడుతోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ప్రసారాలు వంశీ కృష్ణ ఆధ్వర్యంలో జరుగుతున్నాయని తెలిపారు. ఇటీవల పోక్సో కేసులో బండి భగీరథ్‌పై ఆరోపణలు రాగా, బాధిత మైనర్ బాలికకు న్యాయం చేయాలని ప్రవీణ్ కుమార్ ప్రెస్ మీట్‌లో డిమాండ్ చేశారు. దీన్ని జీర్ణించుకోలేకే షెడ్యూల్డ్ కులానికి చెందిన నాయకుడైన ప్రవీణ్ కుమార్ పరువు ప్రతిష్టలను దెబ్బతీసేందుకు కుట్ర పన్నారని నేతలు ఆరోపించారు. మహా న్యూస్ యాజమాన్యం, ఎండీ వంశీ కృష్ణపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, కుటుంబ సభ్యులను ట్రోల్స్ ద్వారా భయభ్రాంతులకు గురిచేస్తున్న వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవమానకర స్క్రోలింగ్స్, ప్రసారాలను తక్షణమే నిలిపివేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నేత మంద శ్యామ్ సుందర్, ఒంటేరు చక్రి, పుష్పిత లయ, స్వేరోస్ రాష్ట్ర ఈసీ మెంబర్ మారపెల్లి మనోజ్, కో-కన్వీనర్ శనిగరం శ్రీనివాస్, స్వేరోస్ నేతలు జన్ను హరికృష్ణ, తేళ్ళూరి సురేష్, దుడేలా సిద్దు, కొగిల కిరణ్, మోట్ల మౌనిక, రాజేశ్వరి, అంబాల చింటూ, గుర్రం సుశ్రుత్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నై ఖేల్ ఖతం

89 రన్స్ తేడాతో టైటాన్స్ చేతిలో చిత్తు

గుజరాత్ ఆల్‌రౌండ్ షో

అహ్మదాబాద్ : ఐదుసార్లు చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ కథ ముగిసింది. గుజరాత్ టైటాన్స్ కొట్టిన ఆఖరి పంచ్‌కు 19వ సీజన్‌లో లీగ్ దశలోనే ఇంటిదారి పట్టింది. బ్యాటింగ్, బౌలింగ్‌లో తేలిపోయిన ఆ జట్టు గురువారం జరిగిన తమ ఆఖరి మ్యాచ్‌లో 89 పరుగుల తేడాతో టైటాన్స్ చేతిలో చిత్తయింది. దాంతో సాంకేతికంగా మాత్రమే రేసులో ఉన్న చెన్నై ఆశలు పూర్తిగా ఆవిరయ్యాయి. మరోవైపు వరుసగా ఐదు విజయాల తర్వాత గత పోరులో కోల్‌కతా చేతిలో ఓడిన టైటాన్స్.. సీఎస్కేపై భారీ విజయంతో రెండో స్థానాన్ని పదిలం చేసుకుంది. తొలుత సాయి సుదర్శన్ (53 బంతుల్లో 7ఫోర్లు, 4సిక్సర్లతో 84), కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (37 బంతుల్లో 7ఫోర్లు, 3సిక్సర్లతో 64), బట్లర్(27 బంతుల్లో 5ఫోర్లు, 4సిక్సర్లతో 57 నాటౌట్), అర్ధసెంచరీలతో గుజరాత్ 20 ఓవర్లలో 229/4 స్కోరు చేసింది. అనంతరం మహ్మద్ సిరాజ్ (3/26), రబాడ (3/32), రషీద్ ఖాన్ (3/18) బౌలింగ్ దెబ్బకు సీఎస్కే 13.4 ఓవర్లలో 140 రన్స్‌కే ఆలౌటైంది. శివం దూబే (17 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 47) తప్ప మిగతా బ్యాటర్లు నిరాశపరిచారు. సిరాజ్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.

భారీ లక్ష్య ఛేదనలో చెన్నై ఘోరంగా తడబడింది. కొత్త బాల్‌తో మహ్మద్ సిరాజ్ ఆ జట్టు టాపార్డర్ నడ్డి విరిచాడు. ఇన్నింగ్స్ తొలి బంతికే స్టార్ ఓపెనర్ సంజూ శాంసన్ (0)ను గోల్డెన్ డకౌట్ చేసిన తర్వాత సీఎస్కే కోలుకోలేక పోయింది. మూడో ఓవర్లో సిరాజ్ ఆ జట్టుకు డబుల్ షాకిచ్చాడు. రెండు సిక్సర్లు, ఓ ఫోర్‌తో ధాటిగా ఆడే ప్రయత్నం చేసిన కెప్టెన్ రుతురాజ్ (16)నుక్లీన్‌బౌల్డ్ చేయడంతో పాటు యంగ్ బ్యాటర్ ఉర్విల్ పటేల్ (0)ను డకౌట్ చేసి 29/3తో కష్టాల్లోకి నెట్టాడు.మరో ఓపెనర్ మాథ్యూ షార్ట్ (24) ఎదురుదాడికి దిగి కొన్ని భారీ షాట్లు కొట్టాడు. కానీ, ఆరో ఓవర్లో రబాడ దెబ్బకు అతను కూడా పెవిలియన్ చేరగా.. కాసేపటికే గిల్ కొట్టిన డైరెక్ట్ త్రోకు కార్తీక్ శర్మ (19) రనౌటవ్వడంతో చెన్నై 63 పరుగులకే సగం వికెట్లు కోల్పోయి దిక్కుతోచని స్థితిలో నిలిచింది. ఈ దశలో హిట్టర్ శివం దూబే అనూహ్యంగా విజృంభించాడు. భారీ షాట్లతో ఫోర్లు, సిక్సర్లతో రెచ్చిపోయాడు. అర్షద్ ఖాన్ వేసిన

తొమ్మిదో ఓవర్లో 6, 4,4 కొట్టిన అతను హోల్డర్‌ను 6.4,6తో శిక్షించాడు. రషీద్ బౌలింగ్‌లోనూ భారీ సిక్స్ కొట్టిన అతను మరో షాట్‌కు ట్రై చేసి గిల్ అందుకున్న మెరుపు క్యాచ్‌తో ఆరో వికెట్‌గా ఔటయ్యాడు. తన బౌలింగ్‌లో రెండు సిక్సర్లు, ఓ ఫోర్ రాబట్టిన అన్షుల్ కాంబోజ్ (19)తో పాటు డెవాల్డ్ బ్రెవిస్ (8)ను ఒకే ఓవర్లో ఔట్ చేసిన రషీద్ గుజరాత్ విజయం ఖాయం చేశాడు. 14వ ఓవరో మిగిలిన రెండు వికెట్లు పడగొట్టిన రబాడ మ్యాచ్ ముగించాడు.సూపర్ ఫామ్‌లో టైటాన్స్ టాపార్డర్ త్రయం సాయి సుదర్శన్, కెప్టెన్ గిల్, బట్లర్ మరోమారు బ్యాట్లు ఝుళిపించారు. సుదర్శన్, గిల్ జట్టుకు అదిరిపోయే ఆరంభాన్ని అందించారు. ఓవర్‌కు రన్‌రేట్ 10కి తగ్గకుండాబ్యాటింగ్ కొనసాగించారు. వరుసగా బౌండరీలు కొట్టడంతో పవర్‌ప్లే ముగిసే సరికి గుజరాత్ వికెట్ నష్టపోకుండా 62 పరుగులు చేసింది. బౌలింగ్ మార్పుగా నూర్ అహ్మద్ లక్ష్యంగా గిల్ రెండు భారీ సిక్స్‌లు బాది 23 బంతుల్లో అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. అప్పటి వరకు గిల్‌కు చక్కని సహకారం అందించిన సుదర్శన్ తన బ్యాటుకు పనిచేబుతూ కంబోజ్ బౌలింగ్‌లో ఫోర్, సిక్స్‌తో పోటీలోకి వచ్చాడు. ఈ జోడీని విడదేసేందుకు పార్ట్‌టైమ్ బౌలర్ శివమ్ దూబే ప్రయోగం కూడా బెడిసికొట్టింది. దూబే వేసిన 10వ ఓవర్‌లో సుదర్శన్ ఫోర్‌కు గిల్ మరో రెండు ఫోర్లు బాదటంతో 15 పరుగులు వచ్చి చేరాయి. ఈ క్రమంలో 35 బంతుల్లో సుదర్శన్ ఫిఫ్టీ అందుకోగా , జాన్సన్ 13వ ఓవర్‌లో దూబే సూపర్ క్యాచ్‌తో గిల్ ఔటయ్యాడు. దాంతో తొలి వికెట్‌కు 125 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్‌పడింది. క్రీజులోకి వచ్చి రావడంతోనే బట్లర్ ఫోర్‌తో ఖాతా తెరిచాడు. ఇక్కణ్నుంచి సుదర్శన్, బట్లర్ పోటీపడి బౌండరీలు బాదడంతో 18 ఓవర్లు ముగిసే సరికి జీటీ 200 పరుగులకు చేరుకుంది. కంబోజ్ 19వ ఓవర్ తొలి బంతికి సిక్స్ కొట్టిన సుదర్శన్..రెండో బంతికి వెనుదిరుగగా, తెవాటి యా(0) రనౌటయ్యాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా..బట్లర్ తన పని కానిస్తూ అర్ధ సెంచరీ పూర్తిచేసుకోవడంతో పాటు జట్టుకు భారీ స్కోరు అందించాడు.

అర్బన్ చాలెంజ్ ఫండ్‌లో వరంగల్‌కు రూ.4,674 కోట్లు

ఎంపీ కడియం కావ్య

డ్రైనేజీ, వరద నివారణ పనులకు భారీ నిధులు

సీఎం రేవంత్ కృషి అన్న ఎంపీ

జనోదయ : వరంగల్ ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అర్బన్ చాలెంజ్ ఫండ్ (ఖజఖీ) కింద వరంగల్ నగరానికి రూ.4,674 కోట్ల భారీ నిధులు మంజూరైనట్లు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య బుధవారం తెలిపారు. తెలంగాణకు ఆమోదమైన మూడు ప్రాజెక్టులకు మొత్తం రూ.5,681 కోట్లు కేటాయించగా, అందులో అత్యధిక భాగం వరంగల్‌కే దక్కడం రాష్ట్ర ప్రభుత్వ కృషికి నిదర్శనమని ఎంపీ పేర్కొన్నారు. ఈ నిధులతో నగరంలో డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణ, వరద నివారణ పనులు, పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టులు అమల్లోకి వస్తే వరంగల్ నగర రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని, ప్రజలకు ప్రపంచ స్థాయి సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం

వద్ద సమర్థవంతంగా ప్రతిపాదనలు ఉంచి ఈ నిధులు సాధించిందని ఎంపీ తెలిపారు. పట్టణాభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి ఫలితంగానే వరంగల్‌కు ఈ స్థాయి నిధులు లభించాయన్నారు. ప్రాజెక్టుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి 50 శాతం నిధులు సమకూర్చనున్నాయని, మిగతా భాగం హడ్కో రుణాల ద్వారా సమీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. పనులు పూర్తయిన తర్వాత వరంగల్ ఆధునిక నగరంగా రూపుదిద్దుకోనుందని ఎంపీ పేర్కొన్నారు.

అగ్నికి ఆహుతైన ఈతవనం

జనోదయ : గంగాధర

జగిత్యాల జిల్లా చొప్పదండి నియోజకవర్గం కోడిమ్యాల మండలం కోనాపూర్ గ్రామంలో ఈరోజు ప్రమాదవశాత్తు సుమారు 8 ఎకరాల ఈతవనం అగ్నికి ఆహుతైంది. మధ్యాహ్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకోవడం, అక్కడ ఎవరూ లేకపోవడం, తీవ్ర ఎండలు ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించి మొత్తం వనం దగ్ధమైంది.గౌడ కులస్థుల జీవనాధారంగా ఉన్న ఈత చెట్లు పూర్తిగా కాలిపోవడంతో బాధిత కుటుంబాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ ప్రమాదంతో భారీ స్థాయిలో ఆర్థిక నష్టం సంభవించినట్లు తెలుస్తోంది.సమాచారం అందుకున్న అటవీ శాఖ సిబ్బంది వెంటనే ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు. స్థానికులు కూడా సహాయక చర్యల్లో పాల్గొన్నారు.ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. అధికారులు ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టనున్నట్లు సమాచారం.

జన్మదినోత్సవాలు, పదవీ విరమణ శుభాకాంక్షల
ప్రకటనల కోసం సంప్రదించండి
8074124190